సాక్షి విశాఖపట్నం

సోమవారం, 2, జూన్, 2025





అల్లిపురం అమ్మవారివీధిలోని డిపో వద్ద వేచి ఉన్న రేషన్ లబ్ధిదారులు







కేఆర్ఎం కాలనీ డిపో వద్ద క్యూలో వేచి ఉన్న కార్డుదారులు



పెందుర్తి పరిధి శ్రీనివాసనగర్‌లో..



ధారపాలెంలో..



పరేషన్

మళ్లీ రేషన్ కష్టాలు మొదలు

- ఎండీయూ వాహనాల రద్దుతో పేదల అవస్థలు
- సర్వర్ మొరాయింపుతో ఎండలో పడిగాపులు
- మెషీన్లు పనిచేయక వెనుతిరిగిన లబ్ధిదారులు
- కార్డుల మ్యాపింగ్ ఒక చోట, రేషన్ డిపో మరో చోట



నక్కవానిపాలెం డిపో వద్ద..



ఈ బాధలు ఇక తప్పవు

మహారాణిపేట: రేషన్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. లబ్ధిదారులకు చుక్కలు కనిపించాయి. దూర ప్రాంతాల్లో ఉన్న రేషన్ డిపోలకు వెళ్లి గంటల కొద్దీ క్యూ లైన్లలో పడిగాపులు పడ్డారు. వేలిముద్రలు రాలేదని, సర్వర్ మొరాయించిందని రేషన్ డీలర్లు చెప్పడంతో చేసేదేం లేక అన్ని పనులు మానుకొని సాయంత్రం వరకు వేచియుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. పేదలు రేషన్ సరకుల కోసం గంటల తరబడి క్యూల్లో నిరీక్షించకూడదని సదుద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన ఇంటి వద్దకే రేషన్ ఎండీయూ విధానాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. మళ్లీ పాత వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల కష్టాలకు తెరతీసింది. చాంతాడంత క్యూలు, మోత బరువు మళ్లీ దాపురించిందని పేదలు వాపోయారు. ఎండీయూ వాహనాల ద్వారా ప్రజలకు మంచి సేవలు అందిస్తుంటే దానిని అభినందించి కొనసాగించాల్సింది పోయి మళ్లీ పాత విధానంలోకి వెళ్లడాన్ని తప్పుపట్టారు. గడిచిన ఐదేళ్లుగా తప్పిన రేషన్ కష్టాలు మళ్లీ ప్రారంభమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంపై అక్కసు, రాజకీయ కక్షతోనే ప్రజా పంపిణీ వ్యవస్థను తిరోగమనంలోకి నెట్టి తమను కూటమి ప్రభుత్వం రోడ్డుపాల్జేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మొరాయింపు, భారీ క్యూలు

రేషన్ షాపుల వద్ద ఆదివారం క్యూలు దర్శనమిచ్చాయి. పాత షాపులకు బూజు దులిపి పూలదండలు, బ్యానర్లతో హైరానా పడి రేషన్ షాపులు తెరిచారు. స్థానిక నాయకులతో ప్రారంభోత్సవాలు చేపట్టి కార్డుదారులను ఎండలో పెట్టారు. సరకుల కోసం వచ్చే వారు రేషన్ డిపోల వద్ద గంటల తరబడి పడిగాపులు పడ్డారు. ఎండలో బారులు తీరారు. ఒక వైపు ఎండ సుర్రుమంటున్న సరకుల కోసం వేచి ఉన్నారు. క్యూలో దగ్గరకు వచ్చేసరికి సర్వర్లు మొరాయించాయి. దీంతో కార్డుదారులు రేషన్ డిపోల వద్ద ఎండలో అవస్థలు పడ్డారు. క్యూఆర్ కోడ్, ఈ పోస్ యంత్రాల వల్ల కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తి ప్రజలను వేచి ఉండేలా చేశాయి.

మోసుకొని వెళ్లారు..

రేషన్ డిపోల వద్ద సరకులను మోసుకొని వెళ్లే దృశ్యాలు దర్శనమిచ్చాయి. గతంలో ఇంటి ముంగిట ఎండీయూ వాహనం ద్వారా ఇచ్చే సరకులను అలా ఇంట్లో పెట్టుకొనేవారు. ఇప్పుడు డిపోలో ఇచ్చే బియ్యాన్ని మోసుకొని వెళ్లడానికి అష్టకష్టాలు పడ్డారు. కొన్ని ఏరియాల్లో ఉదయం 8 గంటలైనా రేషన్ షాపులు తెరవకపోవడంతో కార్డుదారులకు ఉసూరుమంటూ వెనుదిరిగారు. ఈ పోస్ యంత్రాల మొరాయింపుతో కొన్నిచోట్ల డీలర్లు కార్డుదారులపై చిరాకు చూపించడం వంటివి చోటుచేసుకున్నాయి.

ఇంటి వద్ద ఒట్టిమాటే..

దివ్యాంగులు, 65 ఏళ్లు దాటిన కార్డుదారులకు ఇంటి వద్ద సరకులు ఇవ్వాల్సి ఉంది. కానీ తొలి రోజు ఎక్కడా అందజేయలేదు. కొంత మంది వృద్ధులు చిన్న పిల్లల సహాయంతో షాపులకు చేరుకొని సరకులు తీసుకున్నారు. దివ్యాంగులు కూడా వారి వాహనాల్లో వచ్చి సరకులు తీసుకెళ్లారు. కొన్ని ప్రాంతాల్లో రేషన్ డిపో దూరంగా ఉండడంతో ప్రజలు ఒకరోజు పనిమానుకుంటే తప్ప రేషన్ దక్కని పరిస్థితి ఏర్పడింది.

ఎక్కడ పారదర్శకత?

రేషన్ సరకుల్లో పారదర్శకత కోసం ఎండీయూ వ్యవస్థను ఎత్తివేసి పాత పద్ధతిలోనే రేషన్ డిపోల ద్వారా సరకులు ఇస్తున్నామని కూటమి నాయకులు చెప్పిన దానిలో వాస్తవాలు కనిపించడం లేదు. పారదర్శకత పేరుతో ప్రజలపై భారం మోపుతున్నారు. పారదర్శకత కోసం అన్ని రేషన్ షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని కూటమి సర్కార్ ప్రకటించింది. తొలి రోజు ఎక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. దీనిపై డీలర్లకు కూడా స్పష్టత లేదు. ఈ కెమెరాలు డీలర్ల ఖర్చుతో పెట్టాలా.. లేక ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందా అన్న విషయం ఇంకా సందిగ్ధంలో ఉంది.



ప్రహ్లాదపురంలో నాలుగున్నర గంటలకే షాపు మూసి వేయడంతో వేచి ఉన్న వృద్ధులు



పాతగోపాలపట్నంలో రేషన్ డిపో వద్ద ఎండలో వేచి ఉన్న వినియోగదారులు



కేఆర్ఎం కాలనీ వద్ద క్యూలో లబ్ధిదారులు



కె.నరవపాలెంలో మూసి ఉన్న రేషన్ డిపో



రేసపువానిపాలెంలో తాళం వేసి ఉన్న డిపో

తొలి రోజు 5.04 శాతం

జిల్లాలో తొలి రోజు 5.04 శాతం మంది సరకులు తీసుకున్నారు. మొత్తం 5,24,989 మంది తెలుపు/రైస్ కార్డుదారుల కోసం 642 చౌక ధరల దుకాణాలు ఏర్పాటు చేశారు. వీటిలో మొత్తం 637 షాపులు పనిచేస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. తొలి రోజు ఎంతో అట్టహాసం చేసినా 5 శాతం మించి సరకులు సరఫరా కాలేదు. మొత్తం కార్డుల్లో 30,541 మంది బియ్యం, 26,483 మంది పంచదార తీసుకున్నారు.

వృద్ధులకు ఇంటి వద్దకే అన్నారు



65 ఏళ్లు దాటిన వారికి ఇంటి వద్దకే రేషన్ అన్నారు. ఇక్కడ చూస్తే ఆ పరిస్థితి లేదు. డిపోలోనే అందరికీ రేషన్ దొరకడం లేదు. ఇంకా మాలాంటి వారికి ఎలా ఇస్తారు. 4 గంటల నుంచి కాపలా కాశాను. ఒకరిద్దరికి తప్ప రేషన్ ఇవ్వలేదు.

– కట్టా ప్రకాష్, అమ్మవారివీధి

సర్వర్ పనిచేయడం లేదు



ఉదయం వచ్చాం. సర్వర్ పనిచేయలేదు. సాయంత్రం వచ్చాం. ఇప్పుడూ అదే పరిస్థితి. సర్వర్ ఎప్పుడు పనిచేస్తుందో.. రేషన్ ఎప్పుడు తీసుకుంటామో తెలియడం లేదు. రేపటి నుంచి పనికి వెళ్లకపోతే అవ్వదు.

–చాపా శేఖర్, అమ్మవారివీధి, అల్లిపురం

డిపో వద్దకు మార్చారా!



రేషన్‌బండి విధానాన్ని తొలగించి బియ్యం తూనికల్లో మాయజాలానికే డిపో వద్దకు మార్పు చేశారు. ఇది చాలా దారుణం. ఎంచక్కా ఒకటో తేదీన ఇంటి వద్ద బియ్యం తీసుకునేవాళ్లం. ఇప్పుడు దూరంగా ఉండే రేషన్ డిపో వద్దకు వెళ్లి గంటలపాటు వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది.

– టి.శైలజ, శివాజీపాలెం

కష్టాలు మొదలయ్యాయి



గతంలో రేషన్ సరకులు ఇంటి వద్దే తీసుకోవడం అలవాటైంది. ఎండీయూ వ్యాన్‌పై ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ పాత పద్ధతి తేవడంతో ఇబ్బంది పడుతున్నాం. పనులు మానుకుని మరీ రేషన్ డిపోల వద్దకు రావాల్సి వస్తోంది.

– కురం సత్యవతి, కలపాక, పరవాడ



యోగాసనాలు పరిశీలిస్తున్న కలెక్టర్

యోగా డేలో భాగస్వాములు కండి

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపు
- ఎంవీపీలో జల యోగా ప్రదర్శన

ఎంవీపీ కాలనీ: ఈ నెల 21న ఆర్కేబీచ్ వేదికగా నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో జిల్లా ప్రజలతో పాటు అన్ని వర్గాలు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా ఎంవీపీ సెక్టార్–8లోని ఎస్3 స్పోర్ట్స్ ఎరీనాలో ఆర్ట్ ఆఫ్ లివింగ్, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో జలయోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరీనా స్విమ్మింగ్‌పూల్‌లో డాక్టర్ యార్లగడ్డ గీతా శ్రీకాంత్ జలయోగా ప్రదర్శించారు. నుదుటిపై, అరచేతుల్లో జ్యోతులు వెలిగించి, నీటిలో యోగాసనాలు వేశారు. ప్రదర్శనను తిలకించిన కలెక్టర్ మాట్లాడుతూ గీతా శ్రీకాంత్ చేసిన జలయోగ ప్రదర్శన ఆకట్టుకుందన్నారు. ఇదే విధంగా జిల్లాలోని అన్ని వర్గాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రచారం కల్పించాలన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు అన్ని విధాలా సహకారాన్ని అందించాలని కోరారు. గీతాశ్రీకాంత్ మాట్లాడుతూ జలయోగా ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు, ఎస్3 స్పోర్ట్స్ ఎరీనా నిర్వాహకులు పాల్గొన్నారు.



కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగడదాం

'వెన్నుపోటు దినం'పోస్టర్ ఆవిష్కరణలో బొత్స, కె.కె.రాజు పిలుపు



'వెన్నుపోటు దినం' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, ఎంపీ గొల్ల బాబూరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు, సమన్వయకర్తలు వాసుపల్లి, మళ్ల విజయప్రసాద్, తైనాల తదితరులు

సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ప్రజలకు చేసిన మోసాలను ఎండగడదామని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 'వెన్నుపోటు దినం'నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రతీ నియోజకవర్గంలో విజయవంతంగా నిర్వహించాలన్నారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను మోసం చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తోందని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అధికారం చేపట్టిన ఏడాది కాలంలో 80 శాతం హామీలను అమలు చేసి చూపించామని గుర్తు చేశారు. రెండేళ్ల పాటు కరోనా లాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎక్కడా సంక్షేమ పథకాలు ఆపలేదన్నారు. ఎంపీ గొల్ల బాబూరావు మాట్లాడుతూ పేద ప్రజలంటే చంద్రబాబుకు ఇష్టముండదని అన్నారు. వారి పార్టీ కార్యకర్తలు, నాయకుల జేబులు నింపడానికే తప్ప ప్రజలేమైపోయినా ఆయనకు పట్టదని మండిపడ్డారు. కూటమి ఏడాది పాలనలో ఎక్కువగా దళితులపై దాడులు, దౌర్జన్యాలు జరిగాయన్నారు. కె.కె.రాజు మాట్లాడుతూ మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన చంద్రబాబు.. ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. ఏడాది కాలంలో విశాఖ నగర అభివృద్ధికి కనీసం కోటి రూపాయలు కూడా కేటాయించని చంద్రబాబు.. ఈ ప్రాంతంలో ఉన్న భూములను ప్రైవేట్ సంస్థలకు అత్యంత కారు చౌకగా అప్పగించేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు, సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్‌కుమార్, మళ్ల విజయప్రసాద్, దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతి విషయాన్ని గత ప్రభుత్వంపై నెట్టి కాలయాపన చేస్తోందని, రాష్ట్రంలో అభివృద్ధి గానీ, సంక్షేమం గానీ లేదన్నారు. అనంతరం వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు

కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, డిప్యూటీ మేయర్ కె.సతీష్, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, రాష్ట్ర మత్యకార విభాగం అధ్యక్షుడు పేర్ల విజయచందర్, ముఖ్య నేతలు రొంగలి జగన్నాథం, వుడా రవి, గొలగాని శ్రీనివాస్, జహీర్ అహ్మద్, నడింపల్లి కృష్ణంరాజు, రవిరాజు, సతీష్ వర్మ, తాడి జగన్నాథరెడ్డి, చెన్నా జానాకీరామ్, బోని శివరామకృష్ణ, బర్కత్ అలీ, గల్లా శ్రీనివాస్, అల్లు శంకరరావు, కటారి అనిల్ కుమార్ రాజు, ఉరుకూటి రామ చంద్రరావు, పేడాడ రమణి కుమారి, బొండా ఉమా మహేశ్వరరావు, సనపల రవీంద్ర భరత్, మహమ్మద్ ఇమ్రాన్, దొలపల్లి ఏడుకొండల రావు, కోరుకొండ వెంకట రత్న స్వాతి, పద్మా రెడ్డి, గుండాపు నాగేశ్వరరావు, కోడిగుడ్ల పూర్ణిమ, కరజాడ వెంకట నాగ శశికళ, పి.వి.సురేష్, బల్లా లక్ష్మణరావు, గుడివాడ అనూష, అంబటి శైలేష్, అల్లంపల్లి రాజబాబు, శ్రీదేవి వర్మ, రామన్న పాత్రుడు, కిరణ్ రాజు, పల్లా దుర్గారావు, డా.మంచా నాగ మల్లీశ్వరి, ఆల్ఫా కృష్ణ, కాళిదాస్ రెడ్డి, పులగం కొండారెడ్డి, పీలా ప్రేమ కిరణ్ జగదీష్, సకలభక్తుల ప్రసాదరావు, రామిరెడ్డి, చిక్కాల సత్యనారాయణ, దేవరకొండ మార్కండేయులు, షేక్ మహ్మద్ గౌస్, చిన్ని, ఉమ్మడి దాస్, కొణతాల ఉమా మహేశ్వర రావు, ఇమంది సత్యనారాయణ, కంచుమూర్తి పద్మ శేఖర్, బొడ్డెడ అచ్చంనాయుడు, నీలి రవి, కొట్యాడ సూర్య, మహేష్ బాబు, కోమటి శ్రీనివాస్, గణేష్‌గౌడ్, నాగేంద్ర, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

23న విశాఖ అథ్లెట్ జ్యోతికి సత్కారం

విశాఖ స్పోర్ట్స్: జిల్లాలో రానున్న ఏడాది నిర్వహించాల్సిన క్రీడల కోసం సమగ్ర క్రీడా క్యాలెండర్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని విశాఖ ఒలింపిక్ సంఘం, విశాఖ శాఖ కార్యవర్గం అభిప్రాయపడింది. నగరంలో ఆదివారం జరిగిన సంఘ వార్షిక సర్వసభ్య సమావేశంలో గత ఏడాది కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు. ఈ నెల 23న జరగనున్న ఒలింపిక్ డే రన్ సందర్భంగా ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రికార్డు సృష్టించిన విశాఖ అథ్లెట్ జ్యోతిని సత్కరించాలని నిర్ణయించారు. జిల్లాలోని క్రీడా సంఘాలు ఒలింపిక్ సంఘం సహకారంతో ఒక క్యాలెండర్‌ను రూపొందించుకోవాలని సూచించారు. అంతేకాకుండా యోగా డే రిజిస్ట్రేషన్లకు సహకారం అందించాలన్నారు. విశాఖలో క్రీడాకారులకు ప్రోత్సాహం, వసతులు మెరుగుపరచడానికి, ఒలింపిక్ భవనం నిర్మించడానికి కృషి చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా స్కేటింగ్ సమాఖ్యకు నామినేట్ అయిన ప్రసన్నకుమార్, భగీరథ్‌లను సత్కరించారు. సమావేశంలో చీఫ్ పాట్రన్లు పి.వి.జి.ఆర్.నాయుడు, ఎస్.విజయ్‌కుమార్, అధ్యక్షుడు డి.ప్రసన్నకుమార్, కార్యదర్శి కె.సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తికి సన్మానం



న్యాయమూర్తి మానవేంద్ర రాయ్‌ని సన్మానిస్తున్న బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కృష్ణమోహన్

విశాఖ లీగల్: గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రరాయ్‌ని ఆదివారం ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కృష్ణమోహన్, విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం న్యాయమూర్తిని సన్మానించారు. పోక్సో కోర్టు స్పెషల్ పీపీ బత్తి రాజశేఖర్, బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.పి.నాయుడు పాల్గొన్నారు.

విశాఖ చేరిన డబుల్ డెక్కర్ బస్సు



శ్రీకృష్ణాపురంలోని గోశాలలో చార్జింగ్ కోసం వచ్చిన ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సు

సింహాచలం: విశాఖ వీధుల్లో డబుల్ డెక్కర్ బస్సు కనువిందు చేయనుంది. పర్యాటకులకు కొత్త అనుభూతిని పంచనుంది. విశాఖలో పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు డబుల్ డెక్కర్ బస్సు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఎలక్ట్రికల్ డబుల్ డెక్కర్ బస్సు విశాఖకు చేరుకుంది. హనుమంతవాక నుంచి పాత అడవివరం వైపు ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డులో కనువిందు చేస్తూ సింహాచలం దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలకు చార్జింగ్ కోసం ఆదివారం వచ్చింది. గోశాల ముఖ ద్వారం గేటు బస్సు కన్నా తక్కువ ఎత్తులో ఉండటంతో లోపలకి వెళ్లలేదు. గేటు బయటనే నిలిచింది. దాంతో బీఆర్‌టీఎస్ రోడ్డులో సింహాచలం వైపు వచ్చే వారంతా బస్సును ఆసక్తిగా తిలకించారు. గన్నవరం నియోజకవర్గంలోని మల్లివల్లిలో అశోక్ లేల్యాండ్ బస్ బాడీ ప్లాంట్ ప్రారంభమైన నేపథ్యంలో ఆ కంపెనీ తయారుచేసిన డబుల్ డెక్కర్ బస్సును ఏపీ ప్రభుత్వానికి సంస్థ ఉచితంగా అందించింది. దాన్ని విశాఖకు కేటాయించారు. ఒక్కసారి చార్జ్ చేస్తే 150 కిలోమీటర్లు వరకు ప్రయాణిస్తుందని సిబ్బంది చెప్తున్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష



పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు, సిబ్బందికి సూచనలిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



ఏయూ ఇంటర్నేషనల్ బిజినెస్ కాలేజీ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

అల్లిపురం: పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన పోలీస్ కానిస్టేబుల్(సివిల్, ఏపీఎస్పీ) మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నగరంలో మొత్తం 27 పరీక్ష కేంద్రాల్లో మెయిన్స్ పరీక్ష నిర్వహించారు. మెయిన్స్‌కు 12,491 మంది అర్హత సాధించగా, 11,338 మంది మాత్రమే హాజరయ్యారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి, కేంద్రాల లోపలకు అనుమతించారు. నగర ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, డీసీపీ–1(లా అండ్ ఆర్డర్) అజితా వేజెండ్ల, డీసీపీ–2 (లా అండ్ ఆర్డర్) డి.మేరి ప్రశాంతి, డీసీపీ (అడ్మిన్) శ్రీ కృష్ణకాంత్ పటేల్ పలు కేంద్రాలను తనిఖీలు చేసి, పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు.

స్టూడెంట్ బస్సు పాసుల జారీకి ఏర్పాట్లు

దాబాగార్డెన్స్: పాఠశాలలు ఈ నెలలో తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల బస్సు పాస్‌ల జారీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. నగర పరిధిలోని ద్వారకా బస్టేషన్, మద్దిలపాలెం, సింహాచలం, గాజువాక, ఎంవీపీకాలనీ, మధురవాడ, పెందుర్తి, కూర్మన్నపాలెం బస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన బస్‌పాస్ కౌంటర్లు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని పేర్కొన్నారు.

విద్యార్థులు/విద్యా సంస్థలకు సూచనలివి..

- విద్యార్థి తన వివరాలు, ఫొటోను https:// buspassonline.apsrtconline.in/లో నమోదు చేసుకుని, దరఖాస్తు ఫారం ప్రింట్ తీసుకోవాలి.
- ఈ దరఖాస్తుపై సంబంధిత పాఠశాల ప్రిన్సిపాల్ లేదా ప్రధానోపాధ్యాయుడితో సంతకం చేయించి.. దానిని సంబంధిత డిపో కార్యాలయానికి సమర్పించాలి.
- దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డ్, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల మార్కుల జాబితా జిరాక్స్ కాపీని తప్పనిసరిగా జతచేయాలి. విద్యార్థి ఫోన్ నంబర్ తప్పనిసరిగా పేర్కొనాలి.
- తరగతుల వారీగా విద్యార్థుల అడ్మిషన్ జాబితాను ప్రిన్సిపాల్/ప్రధానోపాధ్యాయుడి సంతకంతో సంబంధిత డిపో మేనేజర్ కార్యాలయానికి అందజేయాలి. అలా చేయని పక్షంలో ఆ విద్యా సంస్థ విద్యార్థులకు బస్సు పాస్‌లు జారీ చేయరు.
- 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్లలోపు బాలికలు (10వ తరగతి వరకు) ఉచిత బస్సు పాస్‌తో పాటు స్టూడెంట్ జనరల్ బస్ పాస్ (సంవత్సరం/ త్రైమాసికం/నెలవారీ), స్టూడెంట్ గ్రేటర్ విశాఖ పాస్, స్టూడెంట్ రూట్ పాస్, జేవోసీ పాస్ పొందాలనుకునే విద్యార్థులు సంబంధిత డిపోలకు వెళ్లి దరఖాస్తులను వెరిఫికేషన్ చేయించుకోవాలి. డిపోల్లో ఉన్న 8 కౌంటర్లలో నేరుగా బస్‌పాస్ పొందవచ్చు. ఈ ప్రక్రియలో ఆర్టీసీ సిబ్బందికి లేదా విద్యా సంస్థల్లో అదనపు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు స్పష్టం చేశారు.

విద్యుదాఘాతంలో బాలిక మృతి

తగరపువలస: ఆనందపురం మండలం పందలపాక పంచాయతీ యాతపేటలో శనివారం రాత్రి గండిబోయిన సాయి మేఘన(12) అనే 6వ తరగతి విద్యార్థిని విద్యుదాఘాతంలో మృతి చెందింది. ఆమె తండ్రి ఈ మేరకు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంట్లో మోటారు స్విచ్ ఆన్ చేసిన మేఘన అప్పటికే వర్షం కారణంగా తడిచి ఉండటంతో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. వెంటనే అంబులెన్స్‌లో భీమిలిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు ధృవీకరించారు. సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ కృష్ణ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి


మృతుడు ధన్‌పాల్ బాలాజీ

పరవాడ: అతిగా మద్యం సేవించి ఓ వ్యక్తి లంకెలపాలెం వంతెన వద్ద మృతి చెందినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. మృతుడు విశాఖపట్నం అక్కయ్యపాలేనికి చెందిన జి.ధన్‌పాల్ బాలాజీ(55)గా గుర్తించామన్నారు. సీఐ తెలిపిన వివరాలు.. అక్కయ్యపాలేనికి ధన్‌పాల్ బాలాజీ ఫార్మాసిటీలో అసిస్టెంట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం అతిగా మద్యం సేవించి లంకెలపాలెం వంతెన సమీపంలో స్పృహ కోల్పోయి మృతి చెందాడు. మృతుడి బంధువుల వివరాలు తెలియరాలేదు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, మార్చురీలో భద్రపరిచినట్లు సీఐ తెలిపారు. మృతుడి బంధువుల వివరాలు తెలిసిన వారు పరవాడ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాల్సిందిగా సూచించారు.


ఇంటర్వ్యూలకు క్యూ కట్టిన లబ్ధిదారులు(ఫైల్)

కూటమి ఝలక్
స్వయం ఉపాధి.. ఆశలు ఆవిరి!

- ఊరించి.. ఉసూరుమనిపించిన రాష్ట్ర ప్రభుత్వం
- అర్ధాంతరంగా నిలిచిపోయిన కార్పొరేషన్ రుణాలు
- గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్లు తూచ్
- స్పష్టం చేసిన జిల్లా బీసీ, ఎస్సీ కార్పొరేషన్లు
- ప్రభుత్వ తీరుతో కంగుతిన్న దరఖాస్తుదారులు

స్వయం ఉపాధి ద్వారా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలనుకున్న వేలాది మంది నిరుద్యోగ యువత ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లింది. జిల్లా బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరు కోసం గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్లను అర్ధాంతరంగా నిలిపివేసి.. లబ్ధిదారులకు షాకిచ్చింది. మళ్లీ కొత్త నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను ఊరించి ఉసూరుమనిపించింది. ఎంతో ఆశతో సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకుంటే, అర్ధాంతరంగా ఈ ప్రక్రియను నిలిపివేసి మా బతుకులతో ఆడుకుంటున్నారు. అసలు ఇంత హడావుడి చేసి దరఖాస్తులు స్వీకరించడం ఎందుకు? ఇప్పుడు మళ్లీ కొత్త నోటిఫికేషన్లంటూ కాలయాపన చేయడం ఎందుకు? ఇది నిరుద్యోగుల ఉసురు తీయడమే' అంటూ యువత మండిపడుతోంది.

\- ఎంవీపీకాలనీ

స్వయం ఉపాధి రుణాల మంజూరులో లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. మార్చిలో బీసీ కార్పొరేషన్ రుణాలకు, మేలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఆయా కార్పొరేషన్లు నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో జిల్లాకు చెందిన వేల మంది లబ్ధిదారులు పెద్ద ఎత్తున రుణాలకు దరఖాస్తు చేసుకున్నారు. బీసీ కార్పొరేషన్ రుణాలకు 19,619 మంది, ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు 3,842 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆయా కార్పొరేషన్లు ప్రకటించిన దరఖాస్తు గడువు సైతం ముగియడంతో రుణాల మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. అయితే రుణాల మంజూరు ప్రక్రియను నిలిపేసిన జిల్లా యంత్రాంగం.. మరోసారి నోటిఫికేషన్ విడుదలవుతుందని వెల్లడించడంతో లబ్ధిదారులంతా అవాక్కయ్యారు. రుణాల మంజూరు పేరిట హడావుడి సృష్టించి కూటమి ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ నోటిఫికేషన్ విడుదల చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు.


అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బీసీ కార్పొరేషన్ సిబ్బంది(ఫైల్)

బీసీ లబ్ధిదారులకు ఝలక్

ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న సమయంలో బీసీ కార్పొరేషన్ రాయితీ రుణాలు మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానించి హడావుడి సృష్టించింది. 2024–2025 ఆర్థిక సంవత్సరానికి గానూ మార్చి ద్వితీయార్ధంలో బీసీ, ఈబీసీ, కాపు, బ్రాహ్మణ, కమ్మ, ఆర్యవైశ్య తదితర అనుబంధ కార్పొరేషన్ల ద్వారా 2,436 యూనిట్లకు రుణాలు మంజూరు చేయనున్నట్లు ప్రకటించి, మార్చి 11 నుంచి 22 వరకు దరఖాస్తులు స్వీకరించింది. జిల్లా వ్యాప్తంగా 19,619 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఇంటర్వ్యూలు కూడా నిర్వహించి, 731 మందిని ఎంపిక చేశారు. మే చివరి నాటికి రుణాలు మంజూరు చేస్తామని తొలుత ప్రకటించిన అధికారులు.. ఇప్పుడు ఆ ప్రక్రియను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో ఈ రుణాల మంజూరు ప్రక్రియ సైతం నిలిచిపోయింది. మరోసారి ప్రభుత్వం ఈ రుణాలకు కొత్త నోటిఫికేషన్ విడుదల చేయనుందని అధికారులు వెల్లడించడంతో దరఖాస్తుదారులు మోసపోయామని గగ్గోలు పెడుతున్నారు.

406 యూనిట్లని చెప్పి..చేతులెత్తేశారు!

2025–26 ఆర్థిక సంవత్సరానికి గానూ ప్రభుత్వం జిల్లాకు 406 యూనిట్లను కేటాయించింది. రూ.16.88 కోట్ల విలువైన 32 రకాల రుణాల కోసం ఎస్సీ కార్పొరేషన్ మేలో దరఖాస్తులను ఆహ్వానించింది. లబ్ధిదారులు https:// apobmms. apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అయితే మే 10వ తేదీని చివరి తేదీగా ప్రకటించినప్పటికీ.. సాంకేతిక సమస్యల పేరుతో మే 8వ తేదీ నుంచే వెబ్‌సైట్ పనిచేయడం మానేసింది. దీంతో వందలాది అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. అప్పుడే తీవ్ర విమర్శలు వెల్లువెత్తినా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడు ఏకంగా ఆ నోటిఫికేషన్ ప్రక్రియనే నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో దరఖాస్తు చేసుకున్న 3,842 మంది లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. 'రెండు రోజులు ముందే వెబ్‌సైట్ ఆపేసి దగా చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు ఏకంగా రుణాల మంజూరునే నిలిపేయడం దారుణం. ఇది మమ్మల్ని నిలువునా మోసం చేయడమే.' అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎస్సీ రుణాల దరఖాస్తుకు ప్రభుత్వ వెబ్‌సైట్

ప్రభుత్వ ఆదేశాలు రాగానే ప్రారంభిస్తాం

ప్రస్తుతం రుణాల మంజూరు ప్రక్రియ నిలిచిపోయింది. బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు మరోసారి నోటిఫికేషన్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. 2024–25 ఏడాదికి గాను మే ఆఖరుకు రుణాల మంజూరు ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాలతో రుణాల మంజూరు ప్రక్రియను నిలిపివేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ప్రక్రియ మొదలవుతుంది. జూన్‌లో మార్గదర్శకాలు వచ్చే అవకాశం ఉంది.

\- శ్రీదేవి, ఈడీ, బీసీ కార్పొరేషన్

ప్రక్రియ నిలిచిపోయింది

జిల్లా ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరు ప్రక్రియ ప్రస్తుతం నిలిచిపోయింది. దరఖాస్తు గడువు మే 10గా పేర్కొన్నప్పటికీ రెండు రోజులు ముందుగానే వెబ్‌సైట్ నిలిచిపోయిన మాట వాస్తవమే. అయితే ప్రస్తుతం ఈ రుణాల మంజూరు ప్రక్రియను పూర్తిగా నిలిపేసింది. జిల్లా టార్గెట్‌ను మరింత పెంచే మరోసారి నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిని కొనసాగించవచ్చు. కొత్త వారు మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తాం. –సత్యపద్మ, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

టిడ్కో లబ్ధిదారుల ఆందోళన


టిడ్కో ప్రాజెక్టు గేటు వద్ద నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు


ఆందోళనకారులకు సర్దిచెబుతున్న ప్రాజెక్టు డీఈ రాజేష్

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు మంగళపాలెం టిడ్కో గృహ సముదాయం వద్ద ఆదివారం ప్లాట్ల కేటాయింపుదారులు ఆందోళనకు దిగారు. ఇక్కడ పదేళ్ల కిందట నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశారు. అయితే గృహాలను ఇప్పటికీ అందజేయలేదు. పైగా రోడ్లు, డ్రైనేజీలు, మంచినీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించడంలో జాప్యం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నగదు చెల్లింపులు చేసిన లబ్ధిదారులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ గృహ సముదాయం నిర్మించి పదేళ్లు అవుతోందన్నారు. లబ్ధిదారులందరూ నిర్ణీత మొత్తం చెల్లించారని, నేటికీ గృహాలు కేటాయించకపోవడం వల్ల నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కనీస వసతులు కల్పించి, లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించి సేల్ డీడ్‌లు అందివ్వాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న టిడ్కో ప్రాజెక్టు డీఈ రాజేష్, టాటా ప్రాజెక్టు అధికారి సోమేష్ అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. మూడు నెలల్లో ప్రాథమిక వసతులు కల్పించి ప్లాట్లు అప్పగిస్తామని నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు. నాయకులు కె.వనజాక్షి, జి.ఆనంద్, కె.అచ్చుతరావు, పిల్లా పద్మ, రొక్కమ్ శ్రీనివాసరావు, గోపి, పి.అప్పలరాజు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

- కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న బైక్
- సరిపల్లి దాటిన తర్వాత సర్వీస్ రోడ్డులో ప్రమాదం



మద్దాల శ్రీరామ్, దాని సత్యఅవినాష్(ఫైల్)


సంఘటన స్థలంలో విద్యార్థుల మృతదేహాలు

పెందుర్తి: బైక్‌పై సరదాగా షికారుకు వెళ్లిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. బైక్‌పై వేగంగా వెళుతున్న సమయంలో కుక్క అడ్డు రావడంతో నియంత్రణ కోల్పోయి వాహనం అదుపుతప్పడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆదివారం సాయంత్రం పెందుర్తి పట్టణంలో తీవ్ర విషాదాన్ని నింపిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తి రాచ్చెరువు సమీపంలోని ఆదిత్యనగర్‌కు చెందిన శరగడం శ్రీనివాసరావు కుమారుడు శరగడం దాని సత్య అవినాష్(20), పెందుర్తి కూడలి వద్ద నివాసం ఉంటున్న మద్దాల సుధారాణి కుమారుడు మద్దాల శ్రీరామ్(17) స్నేహితులు. అవినాష్ నగరంలోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా.. శ్రీరామ్ ఇటీవలే ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత సాధించాడు. ఇద్దరు కలిసి ఆదివారం సాయంత్రం ట్రయంప్ బైక్‌పై ఆనందపురం–అనకాపల్లి జాతీయ రహదారి మీదుగా శొంఠ్యాం వైపు వెళుతున్నారు. సరిగ్గా సరిపల్లి దాటిన తరువాత సర్వీస్ రోడ్డులో కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఇరువురు తలలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు సిబ్బందితో అక్కడికి వెళ్లి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతులేని విషాదం

ప్రమాదంలో మృతి చెందిన మద్దాల శ్రీరామ్ తండ్రి సతీష్ కోవిడ్ సమయంలో మరణించాడు. దీంతో సుధారాణి పెందుర్తిలో ఓ కిరాణా దుకాణం నడుపుతూ పిల్లలను చదివిస్తున్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న శ్రీరామ్ ఎంసెట్ రాశాడు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు శ్రీరామ్‌ను బలిగొంది. కాగా శరగడం శ్రీనివాసరావు, అరుణ దంపతులకు అవినాష్‌తో పాటు ఓ కుమార్తె ఉంది. బీటెక్ చదువుతున్న అవినాష్ చదువులో చురుగ్గా ఉంటాడు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారులు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు.

నగరమంతా తీరంలోనే.!


ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఏయూక్యాంపస్: సాగరతీరం ఆదివారం జనసంద్రంగా మారింది. ఎటు చూసినా కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి సంతోషంగా గడుపుతున్న దృశ్యాలు కనిపించాయి. నగరం మొత్తం తీరంలోనే ఉందా అనే భావన కలిగింది. చిన్న పిల్లలతో కలిసి నగరవాసులు పెద్ద సంఖ్యలో ఆర్.కె.బీచ్ నుంచి వీఎంఆర్డీఏ పార్కు వరకు ఉన్న పర్యాటక ప్రాంతాలకు చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతాలన్నీ సందర్శకులతో కిక్కిరిసిపోయాయి. బీచ్‌కి భారీగా వ్యక్తిగత వాహనాల్లో రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. బీచ్‌రోడ్డుతో పాటు సిరిపురం కూడలి, చినవాల్తేరు వంటి ప్రాంతాల్లో వాహనాలు బారులుతీరాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

అనుమానాస్పద మృతి కాదు హత్యే

నిందితుడి అరెస్టు

దాబాగార్డెన్స్: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దారుణమైన సంఘటన చోటు చేసుకుంది. ఓ వ్యక్తి భవనం నుంచి పడి మృతి చెందగా, తొలుత పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం అది హత్యగా తేలింది. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ సీఐ జీడీ బాబు ఆదివారం తెలిపిన వివరాలివి. గత నెల 29న జీవీఎంసీ 36వ వార్డు పరిధిలోని జీవీఎంసీ భవనంపై లోతేటి హేమంత్‌కుమార్, పవన్ సాయి ఏదో విషయమై మాట్లాడుకున్నారు. మద్యం సేవించిన హేమంత్‌కుమార్.. జీవీఎంసీ భవనానికి ఎదురుగా ఉన్న ధోనీ సతీష్ అనే వ్యక్తి ఇంటిపైకి వెళ్లాడు. గతంలో వారి మధ్య తగాదా జరిగింది. మనస్పర్థల కారణంగా హేమంత్‌కుమార్ తన ఇంట్లో సామాన్లు దొంగతనం చేస్తున్నాడని సతీష్‌ను నిలదీశాడు. ఈ క్రమంలో వాగ్వాదం తీవ్రం కావడంతో.. ఆగ్రహించిన ధోనీ సతీష్ హేమంత్‌కుమార్‌ను చెంపపై కొట్టి, భవనం పై నుంచి తోసివేశాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన హేమంత్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తండ్రి చిట్టిరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మొదట అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినప్పటికీ, విచారణలో ఇది హత్య అని తేలడంతో పోలీసులు కేసు సెక్షన్లు మార్చారు. నిందితుడైన ధోనీ సతీష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జీడీ బాబు తెలిపారు.

బాలిక ఆత్మహత్య

తాటిచెట్లపాలెం: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి శ్రీనివాసనగర్‌లో ఆదివారం బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. ఇత్తు నాగరాజు కుటుంబంతో శ్రీనివాసనగర్, దాడి రామ్మూర్తి కల్యాణమండపం సమీపంలో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. నాగరాజు కారు డ్రైవర్ కాగా, భార్య హౌస్ కీపింగ్ పనులు చేస్తోంది. వీరికి మణికంఠ(15), హేమిని(13) ఇద్దరు పిల్లలు. మణికంఠ 10వ తరగతి, హేమిని 8వ తరగతి చదువుతున్నారు. ఆదివారం నాగరాజు విధుల నిమిత్తం వెళ్లగా.. భార్య ఫంక్షన్ నిమిత్తం పద్మనాభం వెళ్లారు. మణికంఠ సాయంత్రం 4.30 గంటలకు స్నేహితుడి దగ్గరికి వెళ్లాడు. సాయంత్రం 6.15 గంటలకు తండ్రి ఇంటికి వచ్చి చూసేసరికి హేమిని హాల్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఫోర్త్ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చదువు దూరం చేయొద్దు


టీచర్‌ను నియమించాలని దండం పెట్టి వేడుకుంటున్న గిరిజన బాలలు, సీపీఎం నాయకులు

కోటవురట్ల: అయ్యా విద్యా శాఖామంత్రి లోకేష్ గారూ.. మా పిల్లలకు చదువులు అవసరం లేదా..గిరిజన పిల్లలు చదువుకు దూరంకావలసిందేనా.. ఓట్ల కోసం ఎన్నో హామీలు ఇచ్చారు... మా పిల్లల కోసం ఓ ఉపాధ్యాయుడిని నియమించలేరా అంటూ అణుకు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తూ దండం పెడుతూ ఆందోళన చేశారు. అణుకు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనులు ఆదివారం ఆందోళన చేశారు. ప్రత్యామ్నాయ పాఠశాలను తెరిచి ఉపాధ్యాయుడిని నియమించాలని నినాదాలు చేశారు. పార్టీ మండల కార్యదర్శి ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ గొట్టివాడ శివారు గ్రామం అణుకు గిరిజన గ్రామంపై చిన్నచూపు తగదన్నారు. గ్రామంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, గత ప్రభుత్వంలో గిరిజనుల పోరాటంతో రోడ్డు వేసి, ప్రత్యామ్నాయ పాఠశాలకు ఉపాధ్యాయుడిని కేటాయించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉపాధ్యాయుడుని తొలగించారని, దీంతో చిన్నారులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ సుమారు 60 మంది పిల్లలు ఉన్నారని, అందుకు తగ్గట్టుగా పాఠశాలను ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వర్షాలకు రోడ్డు కూడా శిథిలమైందని, పిల్లలు రాళ్లు తేలిన రోడ్డుపై చదువు కోసం 12 కిలోమీటర్లు రానుపోను నడవాల్సిన పరిస్థితి ఉందన్నారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.95
బ్రాయిలర్ (లైవ్)	: రూ.115
స్కిన్	: రూ.200
స్కిన్‌లెస్	: రూ.210

శిల్పారామం ఏవోగా రమేష్‌రెడ్డి




పీఎంపాలెం: శిల్పారామం నూతన ఏవోగా సి.రమేష్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. పుట్టపర్తి శిల్పారామం ఏవోగా పనిచేస్తూ ఇక్కడకు ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏవో టి.విశ్వనాథరెడ్డి పులివెందుల శిల్పారామానికి బదిలీ అయ్యారు.

ప్రకృతి ఒడిలో ఆరోగ్య యోగం

- చరిత్రలో నిలిచిపోయేలా యోగా వేడుకలు
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడి
- తొట్లకొండపై ఘనంగా యోగాంధ్ర


యోగాసనాలు వేస్తున్న యువతులు


యోగా విన్యాసాలు చేస్తున్న బాలిక


యోగాసనాల ప్రదర్శనలో పాల్గొన్న నగర ప్రజలు



కొమ్మాది: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని చరిత్రలో నిలిచిపోయే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. బౌద్ధారామాల్లో ఒకటైన తొట్లకొండపై జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం 'యోగాంధ్ర' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలు సంస్థలు, సంఘాల ప్రతినిధులు యోగాసనాలు వేశారు. ముందుగా మయన్మార్‌కు చెందిన బౌద్ధ గురువు రాజధర్మ, కంబోడియాకు చెందిన బర్మరే, విశాఖ బౌద్ధ సంఘ సభ్యులు ధర్మచారి ప్రార్థనలతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం అందరూ వివిధ యోగాసనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21 జరగనున్న యోగా వేడుకలకు ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఆర్.కె.బీచ్ నుంచి భీమిలి వరకు సుమారు ఐదు లక్షల మందితో ఈ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఇందుకోసం గ్రామ, వార్డు స్థాయిల్లో యోగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే యోగా దినోత్సవంలో పాల్గొనే వారికి రవాణా సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమం తర్వాత కూడా ప్రతి ఒక్కరూ మంచి ఆరోగ్యంతో ఉండడానికి యోగాను కొనసాగించాలని, దీనిని తమ జీవితంలో ఒక భాగంగా అలవాటు చేసుకోవాలని కోరారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్, జిల్లా పర్యాటక శాఖ అధికారి జి.మాధవి తదితరులు పాల్గొన్నారు.